# పేపర్ వెయిట్

చాలా కాలం తరువాత ఆఫీసు వదిలాక ఆ ముగ్గురికీ కాసేపు విశ్రాంతిగా కూచుని ఇష్టమైన కాఫీ తాగి ఒకటో రెండో సంగీతం డీవీడీలు కొనుక్కుని తాపీగా ఇంటికి వెళ్ళే సమయం దొరికింది.

"కాఫీ బావుంది గానీ ఇంటికెళ్ళడానికి భయమేస్తోంది" అంది కవిత.

"ఎందుకో?"

"మా పనమ్మాయికి నాలుగు రోజులుగా జ్వరం వచ్చి రావడం లేదు. తాళం తియ్యగానే అంట్లభూతాలు, బట్టల దెయ్యాలు నామీద విరుచుకుపడిపోతాయి. ఆ అమ్మాయికి జ్వరం తగ్గేలోగా నేను పడకెయ్యడం మాత్రం ఖాయం."

"నువ్వు మరీ చాదస్తంగా వుంటావు. పని పెంచుకుంటావు. కాస్త సడలాలి నువ్వు" అంది మహిత.

"నీలాగా నాకూ ఒక సూర్యుడు దొరికితే ఎన్ని కబుర్లయినా చెబుదును."

"నేను సూర్యుడిని ఇంట్లో మనిషికన్న ఎక్కువ చూసుకుంటాను తెలుసా? అసలా పిల్ల వేసే డ్రెస్‌లన్నీ నావీ మా చెల్లివీ... అవికాక మళ్ళీ సంక్రాంతికీ, దీపావళికీ కొత్తవి కొనిస్తాను. ఇంక మందులనీ, మాకులనీ ఒకటేమిటి ఏదడిగితే అదిస్తాను. నేను ఏది తింటే అదే పెడతాను. మొదట్లో నన్ను అమ్మగారూ అనేది నేనే అక్కా అని పిలవమన్నాను." అంది మహిత.

"అవ్వన్నీ మేమూ చేస్తాం అందులో నీ గొప్పేం లేదు. కానీ మా అందరి పనివాళ్ళలాంటిది కాదు మీ సూర్యుడు. తనకి నువ్వంటే ప్రేమ." అంది లలిత.

"అమ్మగార్లకీ, పనివాళ్ళకీ మధ్య ప్రేమలూ వుండవు ఏమీ వుండవు. వాళ్ళు

మానుకుపోతారేమోనని మనకి భయం. మనం తీసేస్తామేమోనని వాళ్ళకి భయం. అంతే... మహిత బాగా జీతం ఇస్తుంది. అందుకే ఆ పిల్ల అలా వుండిపోయింది. ఆ పిల్ల బాగా చేయడం కోసం మహిత ఎంతైనా మర్యాద చేస్తుంది అంతే ఆ అనుబంధం" అంది కవిత.

ఆ మాటలు మహితకి నచ్చలేదు. తను సూర్యుడిని బాగా చూసుకుంటుంది కనుకే ఆ పిల్ల తనకి బాగా పనిచేస్తోంది అనుకుంది. ఈ విషయంలో వాదనలు పెట్టుకుంటే ఇంతదూరం వచ్చి అంత చక్కని కాఫీ తాగిన ఆనందం కాస్తా 'ఉఫ్'మంటుందని మాట మార్చేసింది.

"ముత్యంలాంటి పిల్ల! పాపం ఇట్లా పనిచేసుకుంటోంది కానీ చదువుకుంటే బాగా పైకొచ్చేది. చూట్టానికి కూడా చక్కగా వుంటుంది. మొదటిసారి మీ ఇంటికొచ్చినప్పుడు తను నిజంగా మీ చెల్లేమో అనుకున్నాను" అంది మళ్ళీ లలిత.

ఈ సంభాషణ మహితకి ఇంక నచ్చలేదు. సూర్యుడి అందం ప్రసక్తి ఎందుకు? కుర్రవాడు తెచ్చిన బిల్లు అందుకుని లేచి నిలబడింది.

"సరే.. నాక్కొంచెం బజార్లో పనుంది. వాచీ ఒకటి రిపేరుకిచ్చాను అటు వెళ్ళి తీసుకుపోతాను బై" అని స్కూటర్ స్టార్ట్ చేసింది.

నిజంగానే తెల్లవారుతూనే 'సూర్యో'దయమైతే గానీ మహిత మొహాన చిరునవ్వులు విరియవు... తనూ, సూర్యుడూ పొద్దుట్నించీ చెమటలు కక్కుతూ పరుగులు పెడితేనే పిల్లలవీ, పెద్దలవీ లంచ్ బాక్సులు నిండుతాయి. ఠంచనుగా ఎనిమిదిన్నరకి బ్రేక్‌ఫాస్ట్ టేబిల్ మీద కొస్తుంది. పిల్లల స్నానాలు, బట్టలు ముస్తాబులు అన్నీ సమయానికి జరుగుతాయి. పూర్వజన్మ సుకృతాలు, అదృష్టాలు, దురదృష్టాలు అనే వాటిని చిన్నప్పటినించీ నమ్మలేదు కానీ సూర్యుడు తన ఇంటికొచ్చాక 'అదృష్టం' గురించి నమ్మొచ్చేమో పోనీ అనిపించింది. ఎక్కడ దేనికి బేరమాడాలో, ఎక్కడ చెయ్యి విదిలించాలో మహితకి తెలుసు. సూర్యుడు ఎగిరిపోకుండా ఒక పేపర్ వెయిట్‌లా తను జీతం ఎక్కువ ఇస్తుంది. పదిమంది వచ్చేపోయే ఇంట్లో పనిచేసే పిల్ల కాస్త శుభ్రంగా శుచిగా ఉండాలి కదా అని తనూ, చెల్లీ తీసేసిన డ్రెస్‌లు ఇస్తుంది. ఏం చేసుకుంటాం వాటితో? తనిచ్చే జీతం ఇంకెవరూ ఇవ్వరు కనుక ఆ పిల్ల అలా పనిచేస్తోంది. అంతే కానీ తనంటే సూర్యుడికీ, సూర్యుడంటే తనకీ ప్రేమ వుండడం ఏమిటి? నాన్సెన్స్ అనుకుంది మహిత. కవితకి కాస్త అసూయ అని కూడా అనిపించింది. ఇంత సంపాదించుకుంటోంది పనివాళ్ళ దగ్గర బేరాలేమిటో?"

గుమ్మంలోనే నవ్వుకుంటూ ఎదురైంది సూర్యుడు. పిల్లలకి ఏమి చేసి పెట్టిందో తినేసి టీవీ దగ్గర కుదురుకుని పోయారు.

"మరి నేను వెళ్ళొస్తానక్కా." అంది. ఇవ్వాళ సూర్యుడేదో ప్రత్యేకంగా

కనపడుతోంది. బాగా నవ్వుతూ వుంది. ఎందుకో రోజూలాగా ఆ పిల్లతో మాట్లాడాలని పించలేదు. ముభావంగానే "సరే... కూరలవీ వండేశావుగా! బియ్యం కడిగి కుక్కర్‌లో పెట్టేశావుగా..." అని ఒక జాబితా చదివి అన్నింటికీ టిక్కు పెట్టుకుని "సరే పో" అనేసింది. సూర్యుడు తన మొహంలోకి కాస్త ఆశ్చర్యంగా చూసి గేటు దగ్గరున్న సైకిల్ తీసుకుని వెళ్ళిపోయింది. ఈ సైకిల్ కూడా సతీష్ కొనిపెట్టాడు. అప్పుడు కొంచెం అతనితో గొడవ పడింది గానీ సైకిల్ ఇచ్చాక సూర్యుడు త్వరగా రావడం, మరింత శ్రద్ధగా పని చెయ్యడం గమనించి తను మాట్లాడలేదు. ఈ బజారులో ఏ పనిపిల్లకీ సైకిల్ లేదు...

రాత్రి భోజనాల దగ్గర సతీష్ చెప్పాడు "నేను మూడు నెలలు సెలవు పెట్టాను. మిగిలిపోయిన 'లా' పేపర్లు వ్రాసేస్తాను. నువ్వు పొద్దున్నే హడావిడి పడుతూ తాళాలేసుకుని పోనక్కర్లేదు... పాపం సూర్యుడు కూడా సాయంత్రం పిల్లలొచ్చే వేళకి పరిగెత్తుకుంటూ రానక్కర్లేదు.. నేనుంటాను కదా ఇంట్లో..."

"నువ్వేం సూర్యుడికి అట్లా చెప్పక్కర్లేదు. తన వేళకి తనని రానియ్. పిల్లలకు తినడానికి పెట్టొద్దా?" అని అతన్ని కోప్పడింది మహిత.

సతీష్ ఇంట్లో వుంటే తనకి చాలా సాయం చేస్తాడు.పిల్లల హోంవర్క్ కూడా చేయిస్తాడు. మంచిదే!!

కానీ, అతనలా ఏమీ మాట్లాడకుండా వూరుకోడుకదా? సూర్యకుమారి (మహిత ముద్దుగా సూర్యుడూ అని పిలిచే పిల్ల) రాగానే చెప్పేశాడు "ఇదుగో సూర్యుడూ నువ్వేం కంగారుపడకు.. నెమ్మదిగా పనిచేసుకో. ఇప్పుడు తొమ్మిదిన్నరకల్లా తాళాలేసుకుని పోనక్కర్లేదు నేనుంటానింట్లో.."

ఆ పిల్ల మొహంలో ఒక మెరుపు మెరవడం చూసిన మహిత "సర్లే తనకెందుకా సంగతీ! తన పనేదో పూర్తయేవరకూ చేసుకుని వెడుతుంది" అంది.

ఆ రోజు కూడా సూర్యుడు తెల్లవారుతూనే వచ్చింది. రాగానే చున్నీ తీసి కొంకికి తగిలించి, వాకిట్లో పడివున్న పేపర్లూ, పాలప్యాకెట్లూ లోపలికి తెచ్చింది. డికాక్షన్ వేసింది. పాలు కాచింది. అన్ని పనులూ చకచకా చేసేసి ఆఖరుగా మహిత వేసుకునే డ్రెస్ కూడా తీసిపెట్టింది. పిల్లలూ, మహితీ వెళ్ళేదాకా వుండి బయలుదేరుతుంటే సతీష్ పిలిచి "ఇంటికి వెళ్ళి తొందరగా చేసే పనేమైనా ఉందా?"అనడిగాడు.

"అమ్మ పనికిపోతుంది. సూపర్ బజార్లో వెచ్చాలు బాగుచేసే పని.సాయంత్రం దాకా రాదు. వంట చేసి అమ్మకి డబ్బా తీసుకెళ్ళాలి. నాన్నకి అన్నం పెట్టాలి. బట్టలుతకాలి. ఎందుకు అడుగుతున్నారు?" అంది.

"ఏం లేదు.... కొన్ని కాగితాలు ఫైల్ చేసి పెట్టాలి కాస్త సాయం చేస్తావేమోనని.."

"అయితే సాయంత్రం తొందరగా వచ్చి చేసిపెడతాను. మూడింటికి రానా...?"

"సరే... మూడింటికొచ్చెయ్ మరి." అన్నాడు.

వెడుతూ "మీరు సైకిల్ ఇచ్చినాక అమ్మకి అన్నం తీసుకెళ్ళడానికి బాగుంది. టైర్లే కొంచెం అరిగినయ్ ఫస్టుతారీకు అక్క జీతమిచ్చినాక కొత్త టైర్లు మంచివి కొనిపెట్టండి" అంది.

అన్నట్టె సరిగ్గా మూడింటికొచ్చింది. ఎక్కడెక్కడో వున్న లా పుస్తకాలు గైడ్లు, నోట్సులు వెతికి అన్నీ దులిపి పెట్టింది. ఫైల్లో పెట్టడం చూపిస్తే చక్కగా పెట్టింది.

కొత్త పుస్తకాలు రెండింటికి అట్టలు వేస్తూ వాటిని ముక్కు దగ్గర పెట్టుకుని వాసన చూసింది. తనకి పుస్తకాల వాసన ఇష్టమంది. ఏడో క్లాసు దాకా స్కూలుకు వెళ్ళి మానేశానంది.ఆ పనంతా అయినాక పిల్లలొచ్చే వరకూ తెలుగు పేపర్లో పేజీలు తిప్పింది... సతీష్ టీ పెట్టి తెచ్చి ఆ పిల్లకీ ఇచ్చాడు.. "అయ్యో! నే పేట్టేదాన్నిగా" అంది.

టీ తాగుతూ "మీరిప్పుడు పరీక్షలు రాస్తున్నారంటగా... ఎన్నేళ్ళొచ్చినా చదువుకో వచ్చా?"అంది.

"ఊ... నువ్వూ చదువుకోవచ్చు. నీకెన్నేళ్ళూ?"

"పద్దెనిమిది."

"మధ్యాహ్నమంతా ఖాళీగా వుంటావ్‌గా ఏడో క్లాసు పరీక్షకి చదువు పుస్తకాలు తెచ్చుకో రోజూ... నేనేమన్నా చెబుతాను. మనిద్దరం కంబైన్డ్ స్టడీ..." అని నవ్వాడు.

"చదివితే లాభం ఏముంది? దండగ. ఇంతోటి చదువులకీ ఏం ఉద్యోగాలొస్తయ్ అంటారు మా అమ్మా, నాన్నా... పెళ్ళి చేస్తాం అంటారు. అదేమో కుదర్దు..."

"అందుకే చదువుకో... పెళ్ళయ్యేదాకా..."

పదిరోజుల తరువాత మహిత గమనించింది. సూర్యుడు ఇప్పుడింకా వేగంగా పనిచేస్తోంది. కానీ తొందరగా వస్తోంది పనికి. ఆ పిల్ల పరీక్షకి కట్టుకుందని సతీష్ చెబితే మహితకి ఏమీ ఆనందం కలగలేదు.పైగా నిన్న సాయంత్రం తను రాగానే ఎగురుతూ వచ్చి "అక్కా నా సైకిల్‌కి సార్ కొత్త టైర్లు వేయించి పెట్టారు" అని చెప్పింది.

"బావుంది" అందేగానీ ఆ పిల్ల వెళ్ళిపోయాక సతీష్‌తో బాగా పోట్లాడింది. జీతంలో కోత పెడతానంది. ఆ కోపంలో అక్కర్లేని పనులు కల్పించి చెప్పడం మొదలు పెట్టింది. తను ఎంతైనా ఇవ్వొచ్చు కానీ సతీష్ ఎందుకు ఇవ్వాలి?

మరో పది రోజులకి సూర్యుడి మాటతీరులో మార్పు కనిపించింది మహితకి. ఎప్పుడు తను ఏ పని చెబుతుందా చేద్దామా అని ఆత్రంగా ఎదురు చూసే సూర్యుడు

ఇప్పుడు పనిలో అంత ఆతృత చూపడం లేదు. తను ఒప్పుకున్న పని మాత్రం ఖచ్చితంగా చేస్తుంది.

లలితకి ప్రమోషన్ వచ్చిందని ఆ సాయంత్రం ఇంటికి టీకి పిలిచింది... మళ్ళీ కవిత అక్కడ సూర్యుడి ప్రసక్తి తెచ్చింది. ఆడవాళ్ళ సంభాషణల్లో పని వాళ్ళ ప్రసక్తి రాకుండా వుండదు. మళ్ళీ యజమానీ, నౌకరు సంబంధాల చర్చ వచ్చింది. "ఇక్కడ యజమానులూ లేరు. నౌకర్లూ లేరు. మనం ఉద్యోగం చేసి జీతం తీసుకున్నట్లే వాళ్లూ ఉద్యోగం చేసి జీతం తీసుకుంటున్నారు. అంతే అన్నది లలిత... ఒప్పుకున్న జీతం కన్న మనకి పనికిరాని వస్తువులు ఎన్ని ఇచ్చినా అవి లెక్కకాదు. వాళ్ళకేం సంతోషం వుండదు" అని కూడా అన్నది. మహితకి ఆ సంభాషణ నచ్చలేదు. సూర్యుడు సతీష్‌మీద చూపిస్తున్న శ్రద్ధ తనమీద చూపించడం లేదని మనసులో ముల్లు గుచ్చుతున్నది. తన పనేమీ నిర్లక్ష్యం చెయ్యనప్పుడు ఏమని అడుగుతుంది ఆ పిల్లని?

"నేను వారం రోజులు పనికి రానక్కా అమ్మకి కాల్లో మేకు దిగింది. అదేమో కోతిపుండు బ్రమ్మారాక్షసి అయింది. ఆపరేషన్ చెయ్యాలంట.. మా నాన్నకి కూడా బాగాలేదు" అంది ఒకరోజు పొద్దున్నే సూర్యుడు.

"ఆపరేషన్ రోజు సెలవు తీసుకో వారం ఎందుకు?" అంది మహిత.

"మీ ఇంట్లో పనికి చేరి రెండేళ్ళయింది. ఎప్పుడన్నా ఒక రోజు మించి సెలవడిగానా అక్కా? ఇప్పుడు కావాలి... నీకు సాయం సార్ వున్నారుగా...ఎట్టాగో తంటాలు పడండి మరి.."అంది సూర్యుడు ఏ మాత్రం జంకకుండా.

"వారం రోజులు సెలవు పెడితే జీతం కట్ చేస్తాను."

"చేసుకోండి అక్కా! అట్లా అయితే ఇంకోవారం కూడా పెడతాను. ఫరవాలేదు జీతమేగా" అంది.

మరికాసిని రెట్టింపులయ్యాక తనకి వుందని ఇంతకాలం అనుకుంటున్న సంస్కారాన్ని మర్చిపోయి ఆ ఒక్కమాటా అనేసి స్కూటర్ తీసుకుని ఆఫీస్‌కి వెళ్ళిపోయింది మహిత... మనసంతా చీదర చీదర...

ఇంటికొచ్చేసరికి అంతా మామూలుగానే వుంది. అంట్లు కడిగి వున్నాయి. పిల్లలు టిఫినేదో తినేశారు. సతీష్ బాల్కనీలో కూచుని సీరియస్‌గా చదువుకుంటున్నాడు. సూర్యుడు పనంతా మామూలుగానే చేసిపోయింది. దానికి తెలుసు ఇంకెక్కడ చేరినా ఇంత జీతం రాదని. ఇన్ని సౌకర్యాలుండవని. రేపొక్కరోజు మానేసి ఎల్లుండదే వస్తుంది.

మరునాడు పొద్దున లేచి పేపర్లు తీసుకుంటూ గ్రిల్‌కి గొలుసుతో కట్టిన సైకిల్

చూసింది. "అబ్బో... రోషం వచ్చినట్టుంది అమ్మగారికి" అనుకుంది. సైకిల్ లేకుండా ఒకరోజు హాస్పిటల్ చుట్టూ తిరిగితే తెలిసొస్తుంది.

మూడు రోజులైనా సూర్యుడుదయించలేదు. సతీష్ ఎంత సాయం చేసినా తనకి ఒళ్ళంతా నొప్పులు. పని అలవాటు తప్పిపోయింది. ఆఖరికి బీరువాలో బట్టలు తీసుకోడం కూడా అలవాటు తప్పింది.

పదిహేను రోజులైనా అంతులేదా మనిషి. "ఎంత పెట్టినా అంతే.. వాళ్ళ నైజమే అంత అంది" కవిత. స్వయంగా ఆమె తల్లి పనిచేసే సూపర్ మార్కెట్‌లో వస్తువులు బాగుచేసే చోటు కనుక్కుని తల్లిని పట్టుకుంది మహిత.

"అదింక పనికి రాదమ్మా.. రేపో మాపో వచ్చి మీ లెక్క చెప్పుద్దంట" అనేసిందావిడ.

"తనకి నేనివ్వాల్సిందేం లేదు" అనేసి కోపంగా వచ్చేసింది.

వచ్చింది రెండు రోజుల తరువాత. బక్కచిక్కి మాసిన బట్టలతో రాలేదు. బాగానే వుంది. నవ్వుకుంటూ వుంది.

"నా మీద నీకు గౌరవం లేదు ఎంత చేసినా విశ్వాసం లేదు" అంది మహిత.

"మీ మీద గౌరవం ఎందుకు లేదక్కా! మీరంటే, సారంటే పిల్లలంటే నాకు చాలా ఇష్టం.. కాకపోతే నా మీద కూడా నాకు గౌరవం ఉండాలని తెలిసింది. ఈ సైకిల్ సార్ వాళ్ళ ఆఫీస్‌లో అటెండర్ చవుకగా అమ్ముతుంటే కొన్నానని చెప్పారు. ఇదుగో ఆ డబ్బు తెచ్చాను. సైకిల్ తీసుకుపోతాను మీ గుర్తుగా... సార్ చాలా మంచివాడు. నాకెన్నో సంగతులు చెప్పారు. ఆయన్ని తిట్టకక్కా కళ్ళుపోతాయి..." అని డబ్బు టేబిల్ మీద పెట్టి సైకిల్ తీసుకుని ఒకటికి రెండుసార్లు బెల్లు కొట్టుకుంటూ పోయింది.

'రేపటినించీ సూర్యోదయాలు లేవు. పోన్లే ఈ సూర్యుడు పోతే నీకింకో చంద్రుడు వస్తుంది. నీ పేపర్ వెయిటుందిగా. కాకపోతే, పేపర్ వెయిట్లు కూడా ఎగిరిపోయే గాలులొస్తాయి ఒక్కొక్కప్పుడు..." సతీష్.

అతన్నేదో అనాలని నోరు తెరిచిన మహిత కళ్ళనిండా నీళ్ళొచ్చాయి. సూర్యుడిని పోగొట్టుకున్నందుకు కాదు. తను ఎన్నో మెట్లు దిగిపోయినందుకు.

తనని గురించి తనకు తెలియని చేదు నిజాలేవో తెలుస్తున్నందుకు. అలా వెళ్ళిపోతున్న సూర్యుడి ముఖంలోకి ధైర్యంగా చూడగల ధైర్యం పోగొట్టుకున్నందుకు. పమిట కొంగుతో కళ్ళు తుడుచుకున్నాక చిరునవ్వొకటి మొలుచుకు రానే వచ్చింది. మళ్ళీ మెట్లు ఎక్కలేనంత బలహీనురాలేం కాదు తను. *

'విహంగ' వెబ్ పత్రిక